క్లుప్తంగా

సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులు ప్రారంభం



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నూతన డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా ఈడ్గి మురళీగౌడ్ ఇంటి నుంచి కవ్రెమవ్వ ఆలయం వరకు కవ్రెమవ్వ ఆలయం నుంచి చింతచెట్టు వరకు రూ.10 లక్షలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను అధికమించడానికి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామని ఇందుకు ప్రజలు కూడా స్వచ్ఛత పాటించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, నర్సింహ, మొగ్గలప్ప, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



మరికల్: మండలంలోని తీలేర్ సొసైటీకి గురువారం ఓ లారీ లోడు యూరియా రావడంతో రైతులు సొసైటీ దగ్గర గుమిగూడారు. 300 బస్తాల యూరియా రావడంతో సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులు పట్టా పాసు పుస్తకాలతో యూరియా కోసం క్యూకట్టారు. రెండు గంటల వ్యవధిలోనే 300 బస్తాల యూరియా ఖాళీ కావడంతో కొంతమంది రైతులకు యూరియా దొరకకపోవడంతో అధికారులను నిలదీశారు. మళ్లీ ఆర్డర్ పెట్టామని మరో రెండు లారీల యూరియా వస్తుందని రాగానే అందరికి అందజేస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

మట్టి టిప్పర్ పట్టివేత



మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ క్రాస్ రోడ్డు దగ్గర మట్టి లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ లింగయ్య పెట్రోలింగ్ చేపట్టే క్రమంలో మక్తల్ వైపు వెళ్తున్న టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు తెలియడంతో కేసు నమోదు చేసి మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టిప్పర్ యాజమాని మైనుద్దీన్‌కు రూ.20 వేలు జరిమానా విధించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మన్నన్ తెలిపారు.

కోస్గిలో కంటి వైద్యశిబిరం



కోస్గి రూరల్: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ , కోస్గి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైందని వైద్యులు భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన శిబిరంలో 43 మందిని పరీక్షించగా వారిలో 35 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్టు గుర్తించారు. వీరిని పాలమూరు జిల్లాలోని రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహేందర్‌గౌడ్, మాజీ అధ్యక్షులు పూర్ణచంద్రయాదవ్ ,ట్రెజరర్ బెజ్జు వెంకట్రాములు ,వెన్నశేఖర్ తదితరులు ఉన్నారు.

భూనీడులో హెల్త్ క్యాంప్

కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు గ్రామంలో గురువారం ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు.గ్రామంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేకమంది తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. దాదాపు 100 మందికి వివిధ రకాల టెస్టులు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వై ఆర్జీకేర్ సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్ రెడ్డి, జోనల్ వస్ సూపర్ వైజర్ కృష్ణ, ఆర్జీకేర్ సంస్థ లింక్ వర్కర్లు బాల్‌రాజు, వైద్యులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీపై అవగాహన

ఊట్కూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని డాక్టర్ సాయిరాం అన్నారు. గురువారం ఊట్కూరులోని రైతువేదిక భవనంలో ఈ నెల 11న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో, అంగన్వాడి కేంద్రాలు, కళాశాలలకు వెళ్లి మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ఎంఈఓ మాధవి పాల్గొన్నారు.

‘పాలమూరు’కు ఆటుపోట్లు

- ఇప్పట్లో నీటి ఎత్తిపోతలకు కనిపించని అవకాశాలు
- ఇళ్లు ఖాళీ చేయని నార్లాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులు
- జలాశయంలో ఇప్పటికే నాలుగు టీఎంసీల నీటి నిల్వ
- ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోస్తే ఇళ్లు మునిగిపోయే ప్రమాదం
- ఒకవేళ నింపినా.. ఏదులకు తరలించేందుకు అడ్డంకులు



నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద కొనసాగుతున్న డెలివరీ పంపుల పనులు

కొల్లాపూర్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు ఇప్పట్లో చేపట్టేలా కనిపించడం లేదు. ఇందుకు ప్రధానంగా పలు రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టు పంప్‌హౌజ్ పనులు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ నీటి ఎత్తిపోతలు మాత్రం రెండేళ్లుగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో కచ్చితంగా నీటి ఎత్తిపోతలు చేపట్టాలని అధికారులు భావించినా.. ఆచరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఈ ఏడాది ఆఖరి వరకు ఎత్తిపోతల కోసం ఎదురుచూడక తప్పేలా లేదు.

రెండేళ్ల క్రితమే ప్రారంభం..

పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును 2023 సెప్టెంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఎల్లూరు సమీపంలోని పంప్‌హౌజ్‌లో ఒక మోటార్ ఆన్‌చేసి నీటి ఎత్తిపోతలు చేపట్టి 2 టీఎంసీల నీటిని నార్లాపూర్ రిజర్వాయర్‌కు తరలించారు. తాగునీటి అవసరాల కోసం గతేడాది 4 టీఎంసీల వరకు నీటిని ఎత్తిపోసుకునేందుకు అనుమతులు ఉన్నాయి. అయితే పంప్‌హౌజ్‌లో మోటార్ల బిగింపు, సివిల్ వర్క్స్, విద్యుత్ సరఫరా పనులు పెండింగ్‌లో ఉండటంతో ఎత్తిపోతలు జరగలేదు.

నాలుగు మోటార్ల బిగింపు..

ప్రాజెక్టులోని మొదటి లిఫ్టు ఎల్లూరు పంపుహౌజ్‌లో ఇప్పటి వరకు నాలుగు మోటార్లు బిగించారు. మూడు మోటార్ల పనులన్నీ పూర్తి కాగా.. మరో మోటార్‌కు డ్రై ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంది. లిఫ్టులో ఇంకో నాలుగు మోటార్ల బిగింపు పనులు కొనసాగుతున్నాయి. డెలివరీ మెయిన్స్ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ప్రాజెక్టు వద్ద 400/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాటు చేయనున్న మొత్తం మోటార్లు 9	ప్రస్తుతం ఏర్పాటు చేసినవి 4
ఒక్కో మోటారు సామర్థ్యం 145 మెగావాట్లు	ఒక మోటారు ద్వారా రోజూ ఎత్తిపోసే నీళ్లు 3,000 క్యూసెక్కులు

నార్లాపూర్‌లో నీటి నిల్వ ఇలా..

నార్లాపూర్ రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 6.4 టీఎంసీలు. ప్రస్తుతం పూర్తయిన పనుల ప్రకారం మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవకాశం ఉంది. దీంతో నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి 4 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం ఈ ఏడాది తరలింపునకు కేఆర్ఎంబీ అనుమతులు సైతం ఉన్నాయి. అయితే గతంలో నార్లాపూర్ రిజర్వాయర్‌లో 2 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. ఇటీవల కాలంలో కేఎల్ఐ ద్వారా ఎత్తిపోసిన నీటిని నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి మళ్లించడంతో నీటి నిల్వ 4 టీఎంసీలకు పెరిగింది. రిజర్వాయర్‌లోకి కొత్తగా నీటిని ఎత్తిపోస్తే పలు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి.

పరిహారం చెల్లించాకే..

నార్లాపూర్ రిజర్వాయర్‌లో అంజనగిరి, వడ్డెగుడిసెలు, సున్నపుతండా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. వీరిలో కొంతమందికి సరైన పరిహారం అందలేదు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం తమకు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వారికి పరిహారం ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు. అయితే తమకు పూర్తిస్థాయి పరిహారం అందిన తర్వాతే ఖాళీ చేస్తామని నిర్వాసితులు చెబుతున్నారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు అధికారులు కొత్తగా నీటి ఎత్తిపోతలు చేపట్టే ఆలోచనను విరమించుకున్నారు. ఒకవేళ నీటిని ఎత్తిపోస్తే సున్నపుతండాలో ఇళ్లు మునిగిపోయే ప్రమాదం ఉండటంతో అధికారులు వాయిదా వేస్తున్నారు.

ముందుకు పారించే వీలులేక..

నిర్వాసితుల సమస్యను అధిగమించి నార్లాపూర్ రిజర్వాయర్‌ను నింపినా.. ఆ నీటిని ఏదుల రిజర్వాయర్‌కు తరలించేందుకు అవకాశం లేదు. నార్లాపూర్ రిజర్వాయర్ సమీపంలో కుడికిళ్ల, తీర్నాంపల్లి శివార్లలో 3 కి.మీ., మేర కాల్వ (దాదాపు 20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర) తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. ప్యాకేజీ–3 లోభాగంగా ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు కంపెనీ నిధులు సరిపోలేదనే సాకుతో మధ్యలోనే నిలిపివేసింది. దీంతో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం ఇటీవల కాల్వ పనులు పూర్తి చేసేందుకు రూ.వంద కోట్లకు పైగా నిధులు కేటాయించింది. గత నెలలోనే పనులు ప్రారంభం కాగా.. 6 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పూర్తిచేశారు. మరో 14 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకాలు జరగాలి. ఈ కాల్వ పూర్తయితేనే నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించవచ్చు. అప్పటి వరకు పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు జరిగే అవకాశాలు కనిపించడం లేదు.

ప్రభుత్వం దృష్టిలో ఉంది..



నార్లాపూర్ రిజర్వాయర్‌లో ఇప్పటికే 4 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఈ రిజర్వాయర్‌లోకి మరిన్ని నీళ్లు ఎత్తిపోస్తే నిర్వాసితుల ఇళ్లు మునిగిపోతాయి. కానీ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు పూర్తయితేనే ఇళ్లు ఖాళీ చేస్తామంటున్నారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉంది. త్వరలోనే అన్ని సమస్యలను అధిగమించి ఈ సీజన్ ముగింపులోగా ఎత్తిపోతలు చేపడుతాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

భూ నిర్వాసితులకు చెక్కుల అందజేత



రైతులకు భూ పరిహారం చెక్కులను అందజేస్తున్న ఆర్డీఓ రాంచందర్

నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో భూ పరిహారం చెక్కులను ఆర్డీఓ రాంచందర్ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నారాయణపేట మండలం సింగారం, పెరపళ్ల రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి భూములను ప్రభుత్వానికి అప్పజెప్పి తమ చెక్కులను తీసుకోవడం జరిగిందన్నారు. సింగారంలోని 11 మంది రైతులకు రూ.19,73,600, పెరపళ్లలో 18 మంది రైతులకు రూ .63,63,610 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల కల అయిన ఈ ప్రాజెక్ట్ కింద తమ భూములు కోల్పోయిన వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములను ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిపారు. అలాగే ఇంత త్వరగా చెక్కులు ఇప్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికా రెడ్డికి, నియోజకవర్గ ఇంచార్జి కుంభం శివ కుమార్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

‘మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డివి పగటి కలలు’

నారాయణపేట: మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి మళ్లీ గెలుస్తానని పగటి కలలు కంటున్నారని, గత ఎన్నికల్లో ప్రజలు ఓడించిన మాజీ ఎమ్మెల్యేకు ఇంకా బుద్ది రాలేదని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి.సలీం గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలు పదేళ్లు అధికారంలో కూర్చొపెడితే ఈ ప్రాంతానికి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఎందుకు సాగు నీరు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాలువలు తవ్వకుండా ఉగాదికి నీళ్లు ఇస్తానని గతంలో చెప్పిన మాజీ ఎమ్మెల్యే నేడు కానుకుర్తి గ్రామంలో మళ్ళీ అవే మాటలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు.ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం.పర్ణికారెడ్డి గెలిచిన ఏడాదిలోనే పేట కొడంగల్ ఎత్తిపోతల పథకంను సాధించి, నిధులు మంజూరు చేయించడమే కాకుండా పనులు ప్రారంభం కావడంతో రాజకీయంగా తనకు శాశ్వత విశ్రాంతి దొరుకుతుందని భయపడిన మాజీ ఎమ్మెల్యే ఈ ప్రాజెక్టుపై అబద్దాలు ప్రచారం చేస్తూ రైతులను రెచ్చగొడుతున్నారన్నారు. ఈ ప్రాంత రైతులు బాగుపడడం మాజీ ఎమ్మెల్యేకు ఎంత మాత్రం ఇష్టం లేదని మీ కుటిల రాజకీయాలను వచ్చే ఎన్నికల్లో ప్రజలు తిప్పి కొట్టి మళ్లీ ఓడించడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చేనేతలకు ఉపాధి లభించేలా కృషి



దేవాలయంలో పూజలు జరిపిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

నారాయణపేట/నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్ లో గల భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఒకప్పుడు మగ్గం చీరలు, పట్టు చీరలు అంటేనే నారాయణపేట ప్రసిద్ధి అన్నట్టు ఉండేది రాను రాను నేతన్నలు తగ్గిపోతున్నారన్నారు. పక్క జిల్లా గద్వాల చీరలకు ప్రసిద్దిగా మారిందన్నారు. నేతన్న అభివృద్ధి చెందక పోవడం, సరైన వసతులు, గుర్తింపు, అందాల్సిన ప్రభుత్వ పథకాలు అందక పోవడం వల్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. నారాయణపేటలో ఇప్పటికీ కొన్ని కుటుంబాలు మగ్గంను నమ్ముకుని జీవిస్తున్నాయని, లాభం తక్కువ ఉన్న ఆర్థికంగా వెనుకబడిన వృత్తిని వదిలి ఉండలేక అలాగే జీవనం సాగిస్తున్నారన్నారు. అభివృద్ధి కోసం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసుకుని వారికి అండగా నిలబడి మరింతగా ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామని కమిటీ అధ్యక్షుడు డాక్టర్ క్యాతన్ రఘునాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సంబరి శ్రీనివాస్, తాటి కృష్ణ, కార్యవర్గ సభ్యులు నీలి బాలరాజ్, నర్సింములు పాల్గొన్నారు.

వైభవంగా జీవేశ్వర స్వామి జయంతి



నారాయణపేట: స్వకుళ సాలి ఆరాధ్యదైవం జీవేశ్వర్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సద్గురు అవధూత నరసింహ స్వామి వారి మఠంలో గురువారం మఠం కమిటీ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. మహిళల మంగళహారతులతో భజన సంకీర్తనలతో అభిషేకం పాదపూజ, యజ్ఞం, యజ్ఞోపవిత్ర ధారణ మహామంగళ హారతి, డోలారోహణం, సర్వదర్శనం పల్లకి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు, మహిళలు స్వామి వారిని దర్శించుకున్నారు.

తొలితరం యోధుడు పండుగ సాయన్న

కోస్గి రూరల్: నిజాం పాలనలో జరిగిన అన్యాయాలను ఎదురించిన తొలితరం యోధుడు పండుగ సాయన్న అని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్ మండల అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్ అన్నారు. పండగ సాయన్న జయంతి వేడుకలను శుక్రవారం పట్టణంలోని శివాజి చౌరస్తాలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

నర్వ: మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఉందేకోడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ నిర్వహించినట్లు జిల్లా హౌసింగ్ పీడీ శంకర్ అన్నారు. గురువారం గ్రామంలోని అర్హులకు ఇళ్లను కేటాయించి, ఇళ్లకు ముగ్గులు వేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారులు నిబంధనల మేరకు త్వరితగతిన నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వినయ్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు కొండప్ప, నాగప్పగౌడ్, రామలింగం, ఆంజనేయులు, పెద్ద హన్మంతు, ప్రభాకర్, ఉమాపతి, రాజు, నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను శుభ్రం చేయాలి

నారాయణపేట టౌన్: నారాయణపేట పట్టణంలో ఈ నెల 9వ తేదీన జరిగే జగలింగేశ్వర స్వామి జాతర ఉత్సాహం సందర్భంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్సావాల నేపథ్యంలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అదే విధంగా ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఐదు గ్రామాలకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పెద్దజట్రం, లక్ష్మిపల్లి, బాపూర్, నిడుగుర్తి, తిప్రాస్‌పల్లి గ్రామాలకు శుక్రవారం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు ఆదిహన్మన్న ఉత్సవాలు



మరికల్: జిన్నారం మరికల్ శివారులో వెలసిన ఆదిహన్మన్న కాశీ విశ్వేశ్వర కురుమూర్తి స్వామి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. శనివారం ఉదయం మరికల్ నుంచి స్వామి వారి పల్లకిసేవ ద్వారా భజన కీర్తనాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న తర్వాత అక్కడి నుంచి ఆదిహన్మన్న రథోత్సవంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు దసంగులు పెట్టి ఉపవ్యాస దీక్షలు వదులుతారు.

ఐకమత్యంతోనే రెడ్డిల అభ్యున్నతి

దామరగిద్ద: ఐకమత్యంతో ఉంటేనే రెడ్డిల అభ్యున్నతి సాధ్యమని రెడ్డి సేవా సమితి జిల్లా మాజీ సహాయ కార్యదర్శి బాల్‌చందర్ మండల అధ్యక్షుడు జయదేవ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామంలో రెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్ష ఉపాధ్యక్షులుగా సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, కార్యదర్శిగా శంకర్‌రెడ్డి, కోశాధికారిగా నారాయణ రెడ్డిను ఎన్నుకున్నారు. సేవా సమితి ద్వారా సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో ఈ సేవా సమితిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక రెడ్డిలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



లింగాల్‌చేడ్‌-మన్నాపూర్ మధ్యలో ప్రారంభమైన పనులు

కొత్తపల్లి: మండల పరిధిలోని లింగాల్ చేడ్ నుంచి మద్దూరు వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా కొసాగుతున్నాయి. మద్దూరు నుంచి లింగాల్ చేడ్ వరకు 15.05 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టగా 12 కిలో మీటర్ల దగ్గర లింగాల్‌చేడ్‌–మన్నాపూర్ మధ్యలో పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండడంతో గత నెల 21న సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. నిలిచిపోయిన రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఎండాకాలంలో ఇరువైపులా మట్టి పనులు చేయకుండా వరినాట్ల సమయంలో రోడ్డు పనులు చేస్తుండటంతో రైతులు ఒకింత అసహనానికి గురవుతున్నారు. రోడ్డు విస్తరణ పూర్తి కానుండడంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



బహుమతులు అందిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట రూరల్: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ బహుమతులు అందజేశారు. ధన్వాడ బాయ్స్ స్కూల్ విద్యార్థిని ప్రణీత ప్రథమ బహుమతి గెలుచుకోగా, జాజాపూర్ జడ్పీ స్కూల్ విద్యార్థిని సంధ్య ద్వితీయ బహుమతి అందుకున్నారు. అదే విధంగా దామరగిద్ద జడ్పీ స్కూల్ విద్యార్థి నవీన్ ప్రతి బహుమతి సాధించాడు. వీరికి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా షాక్

మక్తల్: విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ మరమ్మత్తు పనులు చేస్తున్న సమయంలో ఓ రైతుకు కరెంటు షాక్ తగిలి తీవ్రగాయాలతో బయటపడిన ఘటన మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఉప్పర్‌పల్లికి చెందిన రవీందర్‌రెడ్డి పొలంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ అమర్చారు. దానికి మరమ్మతు ఉండడంతో ఉప్పర్‌పల్లికి కరెంటు సరఫరా నిలిపివేయాలని లైన్‌మెన్‌కు రైతు రవీందర్‌రెడ్డి ఫోన్ చేశాడు. అయితే అతను పొరపాటున ఉప్పర్‌పల్లికి సరఫరా అయ్యే కరెంటును బంద్ చేయబోయి మాద్వార్ గ్రామానికి కరెంటు సరఫరా బంద్ చేశాడు. ఈ క్రమంలో రైతు వైరును ముట్టుకోవడంతో షాక్ తగిలి తీవ్ర గాయాలతో కిందపడ్డాడు. వెంటనే అక్కడ ఉన్న కొందరు గాయపడిన రవీందర్‌రెడ్డిని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏడీ జగన్ మోహన్, ఏఈ రామకృష్ణ , మక్తల్ ఎస్ఐ అక్కడికి చేరుకొని సమీప రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సబ్సిడీ పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

మరికల్/కోస్గి రూరల్/ ధన్వాడ: వ్యవసాయ యాంత్రీకరణ కింద వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై సరఫరా చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పనిముట్ల కింద బ్యాటరీ చేతి పంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, రోటవేటర్స్, బ్రష్ కటర్, కల్టివేటర్ సీడ్ కం ఫెర్టిలైజర్ డ్రిల్ల్, పవర్ టిల్లర్, పవర్ వీడర్, స్ట్రా బేలర్ పరికరాలు అందుబాటులో ఉన్నయన్నారు. రోటవేటర్స్, కల్టివేటర్స్ కావాల్సిన రైతులు ట్రాక్టర్ ఆర్సీ రైతు పేరు మీద ఉండాలన్నారు. భూమి పట్టా భార్య పేరు మీద ఉన్న సరిపోతుందన్నారు. ఇందుకు గాను దరఖాస్తు ఫారానికి పట్టదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్ పత్రాలను జత చేసి ఈ నెల 14లోపు మండలంలోని సంబంధిత గ్రామాల ఏఈఓలకు ఇవ్వాలన్నారు. లబ్దిదారులను ఎంపిక చేసిన తర్వాత కంపెనీ పేరు మీద డీడీ తీయాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు రక్షాబంధన్‌ను ఘనంగా జరుపుకొన్నారు. అన్నా చెల్లెల ప్రేమ , అనుబంధానికి ప్రతీకగా రాఖీపౌర్ణమిని జరుపుకుంటారని, పండుగ ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

- నారాయణపేటలోని జాజాపూర్, కొల్లంపల్లి జడ్పీ పాఠశాలలో రాఖీ పండుగను ఆర్.ఎస్.ఎస్, భజరంగ్ దళ్ సభ్యులు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి రాఖీలు కట్టించారు.
- కోస్గిలో నాచారం, సర్జఖాన్‌పేట్, మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులు నీవు నాకు రక్ష ..నేను నీకు రక్ష.. మనందరం దేశానికి రక్ష అని రాఖీలు కట్టుకున్నారు.
- నర్వలోని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో రాఖీ పండుగను వినూత్నంగా జరుపుకున్నారు. జీహెచ్ఎం భాగ్యలక్ష్మీ పాఠశాల ఆవరణలోని మొక్కలకు విద్యార్థులతో రాఖీలు కట్టించి మొక్కలకు రక్షణగా ఉండాలని సూచించారు.
- కృష్ణాలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్ విద్యార్థులతో మొక్కలు నాటించి రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు.
- ఊట్కూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ మాధవి రాఖీపౌర్ణమి ప్రాధాన్యతను వివరించి ఒకరి చేత ఒకరికి రాఖీలు కట్టించారు.
- మరికల్‌లోని పస్పుల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రాఖీలు కట్టుకొని స్వీట్లు తినిపించుకున్నారు.
- దామరగిద్దలోని పీఎం శ్రీ జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్ కార్యాలయాల్లో అధికారులకు రాఖీలు కట్టారు.
- మాగనూర్‌లోని వడ్వాట్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలతో పాటు కొల్పూర్ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రాఖీపౌర్ణమి జరుపుకున్నారు.



నారాయటపేటలో..



ఊట్కూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో..



ముడుమాల్ పాఠశాలలో..



పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో..